
# గోదావరి పుష్కర ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : వచ్చే ఏడాది 2027 జూలై 23 నుండి ఆగస్టు 3 వరకు జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఇలా త్రిపాఠితో, ఇతర జిల్లా అధికారులతో పుష్కర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన కందకుర్తి, తాడ్ బిలోలి, కోస్లీ, తుంగిని, బినోల, ఉమ్మెడ, పోచంపాడ్,. సావెల్, తడ్పాకల్, దోంచంద, గుమ్మిర్యాల్ వద్ద పుష్కర ఘాట్లు ఉంటాయని, వీటితో పాటు అనువైన ఇతర గోదావరి పరీవాహక ప్రదేశాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించవచ్చని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గోదావరి నది తీరంలో సౌకర్యాల కల్పన దిశగా పుష్కర ఘాట్ల వద్ద చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి తన ఛాంబర్ లో అధికారులతో సమావేశం నిర్వహించారు. గత పుష్కరాలలో గోదావరి నదిలో పుష్కర స్నానం చేసిన భక్తుల సంఖ్య, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టాళ్లు, తాగునీరు, తాత్కాలిక గదులు, వాహనాల పార్కింగ్, భద్రత, రూట్ మ్యాప్ ఇతర ఏర్పాట్ల వివరాలను పరిశీలించి, ఆయా శాఖల వారీగా సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున అన్ని అంశాలను నిశితంగా పరిశీలన జరపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీసీ ఆర్.ఎం జ్యోత్స్న, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ధర్మపురి సంజయ్‌కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి కేటాయించాలి

### గాంధీభవన్ కు భారీగా తరలిన మున్నూరు కాపు ప్రతినిధులు

### టీపీసీసీ చీఫ్ కు మున్నూరు కాపు కులస్తుల వినతి

హైదరాబాద్, బతుకమ్మ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ నగర తొలి మేయర్ ధర్మపురి సంజయ్ కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి కేటాయించాలని మున్నూరు కాపు కులానికి చెందిన ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ కు తరలి వెళ్లారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అందుబాటులో లేకపోవడంతో గాంధీభవన్ ఇంచార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షులు కుమార్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా లో సుమారు 4,50,000 మంది మున్నూరు కాపు ఓటర్లు ఉన్నారని గుర్తు చేశారు. గత 12 సంవత్సరాలుగా



నిజామాబాద్ జిల్లా లో మాకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోయిందని వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఉందని ఈ సందర్భంగా ప్రతినిధులు వెల్లడించారు. పార్టీలకతీతంగా మున్నూరు కాపు సోదరులందరం, సోదరిమనులందరు ఏకమై మేము మీకు విన్నవించుకున్నది ఏమనగా మా జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ కి మీరు ఏదైనా గౌరవప్రదమైన పదవి ఇచ్చి మున్నూరు కాపుల అభ్యున్నతికి నాంది పలకాలని వారు కోరారు. సంజయ్ గతంలో మేయర్ గా పని చేశారని, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్రియాశీలకంగా నిజామాబాద్ కార్పొరేషన్ ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే విధంగా పనిచేశారని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపులకు ఇచ్చిన ప్రాతినిధ్యాన్ని ఎన్నటికీ మర్చిపోమని మున్నూరు కాపు సోదరసోదరిమనులం అందరశీ ఏకగ్రీవంగా కోరుకుంటున్నామన్నారు. మున్నూరు కాపు సోదరులు అందరం కూడా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడతామని, మా అందరికీ నాయకత్వం వహిస్తున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి అప్పగించి మున్నూరు కాపులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. నిజామాబాద్ జిల్లా నుండి గాంధీభవన్ కు తరలి వెళ్లిన వారిలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

# విద్యతో పాటు సమాజ సేవలో మమేకం కావాలి

### మోర్తాడ్ మండల అభివృద్ధి అధికారిణి తిరుమల దేవీ

మోర్తాడ్, బతుకమ్మ :విద్యార్థులు విద్యతోపాటు సమాజ సేవలో మమేకం కావాలని మోర్తాడ్ మండల అభివృద్ధి అధికారిణి తిరుమల దేవీ ఆకాంక్షించారు. మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శీతాకాల శిబిరం యొక్క ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ క్యాంప్ దిగ్విజయంగా నిర్వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మర్రిపల్లి భూపతిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మోర్తాడ్ కళాశాల కార్పొరేట్ కళాశాలకు దీటుగా సేవలందిస్తుందని అందరూ కళాశాలలో జాయిన్ అవ్వాలని కోరారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామాన్ని ఎంచుకొని అభివృద్ధి చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు ఏడు రోజుల శిబిరంలో పాల్గొన్న వాలంటీర్స్‌కు ముఖ్య అతిథులు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మరిపల్లి భూపతి మాట్లాడుతూ ఈ ఏడు రోజుల కార్యక్రమం లో చేసిన సేవలను గ్రామస్తులు సంవత్సరం పాటు గుర్తుంచుకొని అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అదేవిధంగా విద్యార్థులు తమ నిత్యజీవితంలో సమాజ సేవను ఉన్నత విలువలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు . ఈ



కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తుపాకుల సదానంద గౌడ్, పంచాయతీ సెక్రెటరీ మహిపాల్, హెల్త్ అధికారిని శ్రీలేఖ, కారోబార్ గ్రామ యువకులు విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మితిమీరుతున్న ఓ అధికారి ఆగడాలు

### సమీకృత మండల కార్యాలయంలో మహిళలపై ఓ అధికారి దురుసు ప్రవర్తన



రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండల కేంద్రంలోని సమీకృత మండల సముదాయ కార్యాలయంలో ఓ అధికారి ఆగడాలు రోజు రోజుకు మితి మీరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఓ అధికారి అయ్యి ఉండి మండల కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళలపై పని ఒత్తిడికి గురిచేస్తూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ విషయం ఎవరికీ చెప్పుకోవాలో తెలియక, ఒకవేళ చెపితే ఉద్యోగం పోతుందేమోనని భయంతో ఆ మహిళలు బాధను మనసులోనే దాచుకుంటూ కుమిలిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# సమిష్టి కృషితోనే సాధ్యం



వేల్పూర్, బతుకమ్మ :నిరక్షరాస్యతను నిర్మూలించడానికి ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమంలో అందరు కలిసి కట్టుగా సమిష్టిగా పాల్గొని కృషి చేస్తే విజయం సాధించడం సాధ్యమని నిజామాబాద్ జిల్లా డీ ఆర్ డీ ఏ డీపీయం వెంకటేశం అన్నారు. ప్రతి వివో ఏ మీ సంబంధిత గ్రామాల్లో వెతికి నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించాలని తెలియజేశారు. తత్ఫలితంగా 100% అక్షరాస్యత కలిగిన మండలంగా మొదటి స్థానం లో నిలబెట్టడానికి అందరం కృషి చేయాలని తెలియజేశారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఎం మాణిక్యం, సీసీలు సరళ, సాయన్న, సున్నిత, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



# కోట మైసమ్మ సైత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో 14వ వార్షిక బ్రహ్మోత్సవ రథోత్సవం ప్రారంభం



బోధన్, బతుకమ్మ :బసవతారక నగర్‌లోని కోట మైసమ్మ సైత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో 14వ వార్షిక బ్రహ్మోత్సవ రథోత్సవం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఘనంగా ప్రారంభమైంది. వేద మంత్రోచ్చారణల నడుమ వేద పండితులు ప్రవీణ్ మహారాజ్, ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి గోపి కిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన బాలయోగి కృష్ణ మహారాజు రథోత్సవాన్ని ప్రారంభించి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడగా, మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మసింగ్ బృందం కోలాటం ప్రదర్శించి ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో ఎనుగంటి గౌతమ్, అనిల్, కిషోర్, కృష్ణ సుదర్శన్, జనార్ధన్, డిగంబర్, గంగాధర్, ఉదయ్, ఈశ్వర్, సంతోష్, అబ్బయ్య, భూమేష్, భాస్కర్, సాయిరాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు

